క్లుప్తంగా

పింఛను కోసం వేడుకోలు


పింఛను కోసం యాగంటి సత్యమ్మ వినతి

కొయ్యలగూడెం : కొయ్యలగూడేనికి చెందిన యాగంటి సత్యమ్మ (117) తనకు పింఛను ఇప్పించమని వేడుకొంటోంది. ఈమెకు ఐదుగురు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు. భర్త మునియ్య చనిపోగా కోఆపరేటివ్ బ్యాంకు వీధిలో ఉంటున్న ఓ కుమార్తె ఆలపాటి అనసూయమ్మ కొన్ని సంవత్సరాలుగా తల్లి బాగోగులు చూస్తోంది. ఇప్పటికే వినికిడి శక్తి, చూపు కొంచెం మందగించిందని, జీవిత చరమాంకల్లో కుమార్తెను ఆశ్రయించి బ్రతకాల్సి వస్తుందని, తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని సత్యమ్మ కోరుతోంది. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు పింఛన్ మంజూరుకు హామీ ఇచ్చారని దానిని అమలు చేయాలని ఆమె కోరుతోంది.

బియ్యం, కూరగాయల అందజేత


యేసు కుటుంబ సభ్యులకు బియ్యం, కూరగాయలు అందజేస్తున్న దృశ్యం

కామవరపుకోట : ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందిన కామవరపుకోటకు చెందిన కంచర్ల ఏసు కుటుంబానికి 50 కేజీల బియ్యం, కూరగాయలు అందజేశారు. ఆడమిల్లి గ్రామానికి చెందిన మొక్కజొన్న సీడ్ ఆర్గనైజర్, వైఎస్సార్‌సీపీ నాయకులు వేముల సాయి, సోషల్ వర్కర్ వీరమళ్ల మధు ఆధ్వర్యంలో ఏసు కుటుంబానికి ఈ సహాయం అందజేశారు. కార్యక్రమంలో టీవీఎస్ రాజు, వీరమల్ల సాజన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం : విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఏఈ కేఎం అంబేద్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఎర్రకాలువ లైన్ రోడ్డు క్రాసింగ్ పనులు చేస్తున్నందున 33/11కేవీ చక్రదేవరపల్లి సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ ఎర్రకాలువ ఫీడర్, 11కేవీ చక్రదేవరపల్లి ఫీడర్ లైన్‌లలో సరఫరా ఉండదన్నారు. కావున విద్యుత్ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహిళా పోలీస్ మాధురికి ప్రతిభ అవార్డు


జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ చేతులమీదుగా ప్రతిభ అవార్డు అందుకుంటున్న మాధురి

గణపవరం : గణపవరం మండలం జల్లికాకినాడ గ్రామ సచివాలయ మహిళా పోలీస్ జీఎంఎస్‌కే మాధురి ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ చేతులమీదుగా ఏలూరు ఎస్పీ కార్యాలయంలో గురువారం ప్రతిభ అవార్డు అందుకున్నారు. విధి నిర్వహణలో విశేష ప్రతిభ చూపినందుకు మాధురికి ఈఅవార్డు అందచేశారు. ఈసందర్భంగా ఆమెను ఎస్పీ శర్మ అభినందించి, భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలన్నారు. మాధురిని గణపవరం సీఐ ఎంవీ సుభాష్, ఎస్సై వేముల వెంకటేశ్వరరావు అభినందించారు.

త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. స్థానిక రామచంద్రరావు పేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో భాగంగా చిన్నారులు త్యాగరాజు కృతులకు కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. అనంతరం కళాకారులకు సత్కారం చేశారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

పెదపాడు : అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో ఎస్.నిర్మలజ్యోతి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఎంపీడీవో నిర్మలజ్యోతి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. పీఎంజేఏవై పథకంలో సంబంధించి ఈకేవైసీ నమోదు పూర్తి చేయాలన్నారు. నాడు-నేడు పనులు వేగవంతం చేయాలన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రాధాన్యత భవనాల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం దాసరి సుమలత, ఈఓఆర్డీ సూర్యకుమార్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- జంగారెడ్డిగూడెం 12, 13, 14 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం


సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం : ఇచ్చిన హామీలు అమలు చేసి చేతల నాయకుడిగా నిరూపించుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే రానున్న ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా కోరారు. గురువారం పట్టణంలోని 5వ సచివాలయం పరిధిలో 12, 13, 14 వార్డుల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల కోసమే పనిచేసే నాయకులను నమ్మవద్దని, ఎల్లప్పుడూ ప్రజాసంక్షేమమే కోరుకునే నాయకుడినే ఎన్నుకోవాలన్నారు. ఇచ్చిన హామీలను అమలుచేయడమే కాకుండా, ఆ హామీల అమలు తీరును కూడా నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకోవడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే చెల్లిందన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ఇవన్నీ ప్రజలకు పాలన చేరువ చేసి వారికి పూర్తి సంక్షేమాన్ని అందించడానికి చేసిన ఏర్పాటే అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపట్ల పూర్తి సంతృప్తిని వ్యక్తంచేస్తున్నారని, తాము ఏ గడపకు వెళ్లినా ఆత్మీయ స్వాగతం పలుకుతున్నారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఎలీజా ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, ఉభయగోదావరి జిల్లాల బూత్ కమిటీల కో–ఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి, పట్టణ అధ్యక్షుడు పీపీఎస్ చంద్రరావు, మండలాధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, కౌన్సిలర్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తిన చిన్న, వందనపు వెంకటేశ్వరరావు, గూడపాటి రాధాకృష్ణ, పటమట గిరిబాబు, కర్పూరం గుప్త, కంచర్ల విష్ణు, పెసరగంటి త్రిమూర్తులు, గంజి వినోద్, కమిషనర్ పి.భవానీ ప్రసాద్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

- చింతలపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ఆదేశం
- పలు అంశాలపై సాగిన చర్చ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బి.రాంబాబు నాయక్

చింతలపూడి : మండలంలో నాడు–నేడులో మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ బి.రాంబాబు నాయక్ ఆదేశించారు. చింతలపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ రాంబాబు నాయక్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రహదారుల అభివృద్ధి, మరమ్మతులు, పారిశుధ్యం, విద్య, వ్యవసాయ రంగం, ఇంధన, ఉద్యాన శాఖల సమస్యలపై చర్చ జరిగింది.అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అదే విధంగా మండల పరిషత్ సమావేశాలకు మండలస్థాయి అధికారులందరూ తప్పనిసరిగా హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కోరారు.

పామాయిల్ మొక్కల పంపిణీపై వాడీవేడిగా చర్చ

పామాయిల్ మొక్కల పంపిణీపై సభలో వాడీవేడిగా చర్చ జరిగింది. ఆర్‌బీకేల్లో నమోదు చేసుకున్న రైతులకు పామాయిల్ మొక్కలు సరఫరా చేయడం లేదని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు కాకుండా దొడ్డిదారిన ఫ్యాక్టరీ యాజమాన్యం మొక్కలను అమ్ముకుంటున్నారని ఆరోపించారు. దీనిపై ఉద్యానశాఖ అధికారి అమర్నాధ్ వివరణ ఇస్తూ ఆర్‌బీకేల ద్వారా మండలంలో 730 మంది రైతులు 790 హెక్టార్లకు మొక్కల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారిలో 323 హెక్టార్లకు మొక్కలు పంపిణీ చేశామని చెప్పారు. ఫ్యాక్టరీ యాజమాన్యానికి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారని, జూలై నుంచి ఆర్‌బీకేల్లో దరఖాస్తు చేసుకున్న రైతులకు మొక్కలు సరఫరా అవుతాయని తెలిపారు. మండలంలో 1,680 ఇళ్లు మంజూరు అయ్యాయని వాటిలో 320 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో 1,114 ఇళ్లు మంజూరుకాగా ఇప్పటి వరకు 7.38 కోట్లు ఖర్చు పెట్టినట్లు గృహనిర్మాణ శాఖ ఏఈ తెలిపారు. 12 లేఅవుట్లలో తాగునీటి కోసం బోర్లు నిర్మించామని చెప్పారు. 7 లేఅవుట్లలో విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. రహదారులను తక్షణం మరమ్మతులు చేపట్టాలని పలువురు ఎంపీటీసీలు అధికారులను కోరారు. గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పథకాల అమల్లో స్థానిక ప్రజాప్రతినిధులను ప్రోటోకాల్ ప్రకారం భాగస్వాములను చేయాలని తిమ్మిరెడ్డిపల్లి సర్పంచ్ శ్యామ్ కోరారు. జెడ్పీటీసీ మొలుగుమాటి నీరజ, తహసీల్దార్ కృష్ణజ్యోతి, ఎంపీడీఓ మణికుమారి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్.గుత్తా కిషోర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి


నినాదాలు చేస్తున్న మాదిగ మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు

జంగారెడ్డిగూడెం : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మాదిగ మహాజన సోషలిస్ట్ పార్టీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి విస్సంపల్లి సిద్దు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెంలో ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతపై మాదిగ మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు వేముల శ్రీనివాస్, నాయకులు పర్వతం రాధాకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వి.సిద్దు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చి 8 ఏళ్లు గడుస్తున్నప్పటికీ వర్గీకరణ చేయకపోవడం బాధాకరమన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వర్గీకరణ చేస్తానని హామీ ఇచ్చి మాట తప్పడం హాస్యాస్పదమని అన్నారు. తక్షణమే దేశ ప్రధాని మోడీ, అమిత్ షాకు ఈ విషయాన్ని తెలియజేసి పార్లమెంటులో చట్టం చేసే విధంగా న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బొడ్డపాటి పండు మాదిగ, మాదిగ మహిళా సమాఖ్య నాయకురాలు సీహెచ్ విజయ మాదిగ సొంగ నక్షత్ర మాదిగ హైమా మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో రైతులకు లాభం


రైతుల ఆధ్వర్యంలో అగ్నిఅస్త్రం తయారు చేస్తున్న సేంద్రియ వ్యవసాయ సిబ్బంది

కామవరపుకోట : సేంద్రియ వ్యవసాయంతో రైతులకు లాభమని సేంద్రియ వ్యవసాయ మండల కోఆర్డినేటర్ షేక్ హుస్సేన్ బి అన్నారు. గురువారం తడికలపూడి గ్రామంలో మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు అగ్ని అస్త్రం సేంద్రియ ఎరువును తయారు చేశారు. ఈ సేంద్రియ ఎరువు తయారీకి వేపాకు, 30 లీటర్ల ఆవు మూత్రం, 15 కిలోల పొగాకు, 1 1/2 వెల్లుల్లి, 1 1/2 పచ్చిమిర్చితో తయారు చేయవచ్చునని, ఆరు లీటర్ల అగ్ని అస్త్రంతో 200 లీటర్ల నీటిని కలిపి పంటకు పిచికారి చేయాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చునని రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీహెచ్ ఈ.వల్లూరిప్రేమ్ కుమార్, సేంద్రియ వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

26న రోటరీ సూపర్ ఎయిట్ క్రికెట్ పోటీలు

జంగారెడ్డిగూడెం : యువత క్రీడాస్ఫూర్తిని అలవరచుకుని బెట్టింగ్ విష సంస్కృతికి దూరంగా ఉండేందుకు జంగారెడ్డిగూడెం రోటరీ ఆధ్వర్యంలో రోటరీ సూపర్ ఎయిట్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు దాకారపు కృష్ణ తెలిపారు. రోటరీ సహాయ కార్యదర్శి కొమ్ముకూరి నాగేశ్వరరావు అధ్యక్షతన గురువారం స్థానిక శ్రీ మల్లాది సీతారామలింగేశ్వరరావు రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కృష్ణ మాట్లాడుతూ లయన్స్, మానవత, వాసవీ క్లబ్‌ల మధ్య స్నేహపూర్వక ప్రత్యేక పోటీ ఈనెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవం రోజు శ్రీచత్రపతి శివాజీ త్రిశత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మానవత, లయన్స్, వాసవీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సక్రమంగా నిర్వహించాలి


పునుకొల్లులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రాంబాబు

పెదపాడు : మండలంలోని పునుకొల్లు గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న తీరుపై డ్వామా పీడీ రాంబాబు మండిపడ్డారు. గురువారం ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా పనులు జరుగుతున్న విధానాన్ని, మస్తర్లు పరిశీలించారు. పనులు గుర్తించి ప్రజలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు చేపడతామన్నారు. గ్రామంలో లేనివారికి, పనులకు రాని వారికి ఉపాధి హామీ పనుల్లో మస్తర్లు వేయరాదన్నారు. అలా జరిగితే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. టెక్నికల్ అసిస్టెంట్ల పర్యవేక్షణ లోపం కారణంగానే ఇలాంటి చర్యలు జరగడానికి అవకాశం ఉందన్నారు. పనులు జరిగేటప్పుడు మస్తర్లు తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


బయ్యనగూడెంలో కలిసిన పూర్వ విద్యార్థులు

కొయ్యలగూడెం : బయ్యనగూడెంలో గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 1989–90 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు 33 ఏళ్ల తరువాత చదివిన హైస్కూల్లో కలిసి ఆహ్లాదంగా గడిపారు. మిత్రులను కుశల ప్రశ్నలు అడిగి, ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం భవిరిశెట్టి ఫంక్షన్ హాల్లో చదువు నేర్పిన అప్పటి గురువులు సీహెచ్ శాంతికుమారి, పట్టాభిరామమూర్తి, సీహెచ్ సుభాష్ చంద్రబోస్, ఎస్వీ రమణ, ఎస్.సత్యనారాయణరాజు, ఎం.జానకిదేవి, టి.సుజారత్నం, గోవర్ధన్‌రావులను సత్కరించారు. ఒక ట్రస్ట్‌గా ఏర్పడి పేద విద్యార్థులకు సహాయపడాలని, స్కూల్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పెన్మెత్స శ్రీనివాసరాజు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పారేపల్లి నరసారెడ్డి, వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ భవిరిశెట్టి సుబ్బారావు, పారిశ్రామికవేత్త మద్దు త్రినాథ్, వేదాంతం శ్రీనివాస్, ఎస్వీఅహ్మద్, బ్లాక్ బెల్ట్ నేషనల్ అవార్డు విన్నర్ శ్రీధర్ యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యలపై ఉచిత సహాయం


సమావేశంలో మాట్లాడుతున్న పెంజుర్తి రవికిరణ్

ఏలూరు (టూటౌన్): వినియోగదారులకు కలిగే సేవాలోపాలకు సంబంధించిన అంశాలపై ఉచిత సహాయం అందించేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉందని వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరమ్ చైర్మన్ పెంజుర్తి రవికిరణ్ చెప్పారు. స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఫోరం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో ఏదో ఒక విషయంలో వస్తువుల నాణ్యతా లోపం, ఆహార పదార్థాల కలుషితం, సేవాలోపం వలన జరిగే వివిధ రకాలుగా నష్టపోతున్న వినియోగదారునికి ఉచితంగా సమస్యను పరిష్కరించేందుకు తమ సంస్థ సభ్యులు పని చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న జాతీయ ఆర్గనైజింగ్ కార్యదర్శి పాతూరి రామరాజు మాట్లాడుతూ సమాజంలో జరిగే వివిధ కలుషితమైన ఆహారాన్ని నియంత్రించాలని తెలిపారు. సమావేశంలో ఏలూరు జిల్లా ఇన్‌చార్జి కోరాడ నరసింహారావు, జిల్లా అధ్యక్షుడు దాసరి మోజేస్, కార్యదర్శి ధర్మవరనపు దుర్గారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శులు వెలమర్తి నాగేశ్వరరావు, నీలం బాబు, పిఆర్‌ఓ శ్రీనివాస్, లీగల్‌అడ్వైజర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా రామాలయ నిర్మాణ పనులు


బయ్యనగూడెంలో నూతనంగా నిర్మిస్తున్న పెద్ద రామాలయం

కొయ్యలగూడెం : బయ్యన్నగూడెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పెద్ద రామాలయం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. సుమారు వంద సంవత్సరాలకు పైగా ప్రాశస్త్యం కలిగిన పాత రామాలయాన్ని పూర్తిగా తొలగించి ఆస్థానే నూతన రామాలయాన్ని గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. సుమారు రూ.50 లక్షల వ్యయంతో జెడ్పీ హైస్కూల్‌కి వెళ్లే దారిలో ఆలయాన్ని నిర్మిస్తున్నారు. శిల్పి సూరిరామరాజు పర్యవేక్షణలోని బృందం సభ్యులు ఆలయాన్ని పూర్తి చేసే పనిలో నిమగ్నం అయ్యారు. ఆలయ ధర్మకర్త తుమ్మలపల్లి రామారావు నేతృత్వంలో వచ్చే శ్రీరామనవమికి ఆలయాన్ని ప్రారంభించే యోచనలో పాలకవర్గం ఉంది. నూతనంగా సీతారామ సహిత హనుమద్ లక్ష్మణ శిలా విగ్రహాలు, గ్రానైట్‌తో కూడిన ప్రధాన ద్వారం దశావతార చిత్రాలు రూపుదిద్దుకుంటున్నాయి.

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు


ఎస్ఏ-1 రికార్డులు పరిశీలిస్తున్న డీవైఈవో రవీంద్ర భారతి

ఉంగుటూరు (నిడమర్రు): సంగ్రహణాత్మక మూల్యాంకనం -1లో మార్కులు తక్కువ వచ్చిన విద్యార్థులకు పాఠశాల అనంతరం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తాడేపల్లిగూడెం డీవైఈవో ఎస్.రవీంద్ర భారతి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం కైకరం జెడ్పీస్కూల్‌ని ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. ఎస్ఏ–1 పరీక్షల జవాబు పత్రాలను, సంబంధిత ఉపాధ్యాయుల వ్యక్తిగత రికార్డులు తనిఖీ చేశారు. జవాబు పత్రాల్లోని తప్పులు సరిచేసి, ఆ తప్పులు విద్యార్థులు గుర్తించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. దుద్దిన జవాబు పత్రాలను విద్యార్థి ఇంటికి పంపించాలని, మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం సీహెచ్ శ్రీనివాసకుమార్ తదితరులున్నారు

వేమన జయంతిని నిర్వహించడం అభినందనీయం

ఏలూరు (టూటౌన్): యోగి వేమన జయంతిని ప్రభుత్వం నిర్వహించడం అభినందనీయమని ఏపీ విశ్వబ్రాహ్మణ ధర్మ పీఠం కన్వీనర్ ఏ.శివశ్రీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా తాడేపల్లి ముఖ్యమంత్రి కార్యాలయానికి సమీపంలోని వేమన, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం పరిసరాల్లో ఆక్రమణలను తొలగించి ఇరువురి సాహిత్యము, ప్రబోధాలపై అధ్యయన కేంద్రాలను నెలకొల్పాలని శివశ్రీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వీరివురి ఉపదేశాలు వేద ప్రామాణికమైనవని తెలిపారు. సమాజంలోని అనేక సామాజిక రుగ్మతలకు వీరి సందేశాలు పరిష్కారాన్ని చూపుతాయని తెలిపారు. సాటి మానవున్ని దైవంగా భావించి ప్రేమించే తత్వం వేమన్న, వీరబ్రహ్మేంద్ర స్వామి సందేశాల సారాంశమన్నారు.

రక్తహీనతతో ఆరోగ్య సమస్యలు

గణపవరం : విద్యార్థులలో రక్తహీనత కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తి చదువులో వెనుకబడతారని అందువల్ల ప్రతి ఒక్కరూ రక్తహీనత సమస్యనుంచి బయటపడాలని హెచ్‌ఎం బి.కాంతిశ్రీ అన్నారు. గురువారం కాశిపాడు హైస్కూల్‌లో ప్రధానమంత్రి బాలస్వస్థ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఐరన్ మాత్రలు వేశారు. ప్రాథమిక, అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు ఐరన్ మాత్రలు వేశారు. క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలు వాడటంతో పాటు ఆకు కూరలను ఎక్కువగా తీసుకొంటే రక్తహీనత సమస్య ఉండదన్నారు.

నేడు కన్నాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం

కొయ్యలగూడెం : కన్నాపురం గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కన్వీనర్, ఏఎంసీ డైరెక్టర్ గాడిచర్ల సోమేశ్వరరావు పేర్కొన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం : చెడు వ్యసనాలకు బానిసై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం చెడు వ్యసనాలకు బానిసైన స్థానిక పాతబస్టాండ్‌కు చెందిన షేక్ అబుబకర్ సిద్ధిక్ (నన్ను)(40) ఇంట్లో ఎవరు లేని సమయంలో గురువారం సాయంత్రం ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుదు. కారుడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న సిద్దిక్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య స్థానిక ప్రైవేట్‌స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అటవీ బంజరు భూములు పేదలకు పంచాలి

టి నరసాపురం : అటవీ బంజరు భూములను ప్రభుత్వం పేదలకు పంపిణీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి సాకా గంగరాజు డిమాండ్ చేశారు. స్థానిక గండిమెట్ట వద్ద సీపీఐ బందంచర్ల శాఖ సమావేశం వీరంకి వెంకట్రావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండిమెట్ట, బందంచర్ల గ్రామాల్లోని అటవీ బంజరు భూములను పేదలకు పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వం వన సంరక్షణ సమితులను ఏర్పాటు చేసి భూమి లేని పేదలకు కుటుంబానికి హెక్టారు చొప్పున భూపంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడిగడప జయరాజు, అడ్వకేట్ ఎం.రాజ్ కుమార్, తాణంకి కొండయ్య, శౌరి, వెంకటేష్ పాల్గొన్నారు.

24న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కామవరపుకోట : ఈ నెల 24వ తేదీన కామవరపుకోట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. మండలంలోని వివిధ శాఖల పనితీరు, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులతో పాటు అధికారులందరూ పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.